


# మరో అడుగు

## - డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

తను అనుకున్నంత సులభంగా చెప్పలేకపోయినా, తనకి సాధ్యమైనంత నెమ్మదిగా, వివరంగా, సరళంగా చెప్పాడు డా. సుజిత్.

కనీసం చెప్పానని అనుకున్నాడు.

ఇలాంటి విషయాలు వినడం,జీర్ణం చేసుకోవడం ఎవరికీ సులువు కాదు.

ఒక పెద్ద స్పెషలిస్ట్ గా ఎన్నో కేసులని చూసిన ఆయనకి ఆవిషయం తెలియనిది కాదు. అందుకనే తానూ, రాజేష్ పరీక్షలు నిర్వహించడం, విషయన్ని రకరకాలుగా, నెమ్మదిగా ఒక ప్లాన్ ప్రకారమే చెప్పారు.

అయినా తమ చిన్నారి కూతురి మీద ఒక్కసారిగా పడిన ఈ ఆపద గురించి విని తట్టుకోలేక అల్లాడుతున్న ఆ తల్లితండ్రులని చూస్తే ఆయన మనసు బాధతో మూల్గింది.

నీళ్ళు నిండిన కళ్ళతో ఆయన్నే చూస్తున్న కిరణ్..

భర్త భుజం మీద తల వాల్చుకుని, స్పృహ తప్పిందో, లేక విన్నదాన్ని హరాయించుకోలేని బాధతో అలా డస్సి పోయిందో తెలియకుండా కళ్ళు మూసుకున్న రాధిక.

వారిద్దరి వైపు కొండంత జాలితోనూ, సానుభూతితోనూ చూస్తున్న డా.రాజేష్..

కిరణ్ రాధిక ల పక్కగా,  కాస్త వెనకే నిలబడి ఉన్న రోహిణీ, శేఖర్.

అందరూ మాటలు మర్చిపోయినట్టు ఉండిపోయారు.

ఒక్క రోహిణి కళ్ళల్లో మాత్రం కోపం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

' చీమకి హాని చెయ్యరు మా స్నేహితులు. ముద్దులు మూటగట్టే బంగారు తల్లి. ఎందుకింత కష్టం?' అన్న బాధ, దాంట్లోంచి ఎవరిమీదో తెలియకుండా వచ్చిన కోపం ఆమె కన్నుల్లో.

అయినా ఆమె  ఏమీ మాట్లాడలేదు.

ఆమే కాదు, అందరూ కూడాచిత్తరువులైపోయినట్టుగా ఉండిపోయారు.

సన్నగా ఏ.సీ చేస్తున్న చప్పుడు తప్ప మరే శబ్దమూ లేదు ఆ గదిలో.

గాలి కూడా స్థంభించినట్టయిపోయింది.

రోహిణినీ, శేఖర్నీ పెద్దగా పట్టించుకోలేదు సుజిత్.

కానీ కిరణ్, రాధిక, తన స్నేహితుడు డా.రాజేష్, ఆ ముగ్గురినీ అలా చూసేసరికి చాలా కంగారు పడ్డాడు డా.సుజిత్.

సాధారణంగా ఆయన చాలా నిబ్బరంగాను, సంయమనంతోనూ ఉంటాడు. ఒక పెద్ద డాక్టర్ కి ఉండవలసిన ప్రొఫెషనల్ లక్షణాలన్నీ ప్రయత్నమ్మీదనూ, అనుభవం వల్లనూ అలవర్చుకున్నవాడు.

మొదటినించీ స్వప్నిక తమకెంత ప్రత్యేకమో రాజేష్ దంపతులు చెప్పి ఉండడం వల్లనో, ఎంతో ప్రతిభావంతురాలైన ఆపిల్ల గురించి తెలిసి ఉండడం వల్లనో, మరెందువల్లనో తెలియదు కానీ ఆయన కూడా చాలా కళవళపడిన మాట వాస్తవం.

'డాక్టర్లూ మనుషులే. అందరికీ ఉండే భావనలే మాకూ ఉంటాయి.'అనుకున్నాడు.

రాజేష్ టేబిల్ వెనక నిలబడి, అటూ ఇటూ అడుగులు వేస్తూ విషయాన్ని చెప్పిన సుజిత్ కిరణ్, రాధికలవైపు మరింత సహానుభూతిగా చూస్తూ, అటువైపునిండి వారివద్దకు వచ్చి అనునయంగా కిరణ్ భుజం మీద చెయ్యి వేసి అన్నాడు.

" ఒక డాక్టర్ గా ఇలాంటి వార్తలు చెప్పడం ఎప్పుడూ, ఎవరికీ తేలిక కాదు. నేను కూడా అందుకు మినహాయింపు కాదు. పేషెంట్ల రుగ్మతలమీద బ్రతికేవాళ్ళమే అయినా ఎవరికి ఏ రకమైన ఇబ్బంది వచ్చినా మాకు చేతనైనంత సహాయమూ, చికిత్సా చెయ్యాలనే కోరుకుంటాం. నేను చెప్పిన విషయం ఎలాంటిదో, దానివల్ల మీ అందరికీ ఎంత బాధా, వేదనా కలుగుతాయో నాకు తెలియనిది కాదు. కానీ ఒక డాక్టర్ గా, ముఖ్యంగా కేన్సర్ స్పెషలిస్ట్ గా చెప్పక తప్పదు. ఈ రోజుల్లో టెక్నాలజీ, చికిత్సా విధానాలు, మందులూ, అన్నీ, అన్నీ ఎంతో అభివృద్ధి చెందాయి, చెందుతున్నాయి. అందువల్ల స్వప్నిక తప్పకుండా కోలుకుంటుంది, కాకపోతే కొంత సమయం పట్టచ్చు. దయచేసి మీరు ధైర్యం తెచ్చుకుని, కాస్త ధృఢంగా ఉంటే ఆమె కూడా త్వరగా సమాధానపడతారు. మీరే ఇలా బెంబేలు పడిపోతే ఆవిడ, పిల్లలూ ఎలా తట్టుకుంటారు? ముఖ్యంగా స్వప్నిక. తన గురించి ఆలోచించండి. ఇలాంటి పరిస్థితిలో తనకి మనందరం ఎంత ధైర్యం చెప్పాలి? ఎంత అండగా ఉండాలి? కదా! సమస్య వచ్చాకా, 'నాకే ఎందుకు? 'అన్న ప్రశ్న వేసుకోకపోవడమే మంచిది. ఎవరికైనా ఎదురవవచ్చు ఇలాంటి పరిస్థితి. వచ్చిన దాన్ని ఎలా ఎదుర్కొనాలో తెలుసుకుని, ఆ దిశలో ఆలోచిస్తే మనకి ఉన్న మార్గాలేమిటి అనేది చూస్తాం కదా. వచ్చిన కష్టాన్ని గురించి వ్యధ చెందుతూ, దేవుడినో, విధినో తిట్టుకుంటూ కూర్చోవడం మన ఎదురుగా ఉన్న సమస్యని పరిష్కరించదు కదా.. మన ప్రయత్నం తప్పకుండా చెయ్యాలి, చేద్దాం. అందరం కలిసి చేద్దాం. ఎంతో జీవితం చూడవలసిన చిన్న పిల్ల, పైగా మంచి క్రీడాకారిణి. ఆమె త్వరలోనే కోలుకుని, తన భవిష్యత్ లో ఎన్నో శిఖరాలని అధిరో హించాలనే కదా మనమందరం కోరుకునేది. అది జరగాలంటే మనందరం ధైర్యంగా ఉంటూ, ముందు ఏం చెయ్యాలన్నది చూడాలి. అవునంటారా?" అంటూ కిరణ్ కళ్ళల్లోకి చూశాడు డా. సుజిత్.

తన భుజం మీద వేసిన ఆయన చేతిని కళ్ళకానించుకుని నీళ్ళు నిండిన కళ్ళని మూసుకుంటూ మౌనంగా తలాడించాడు.

ఉబికి వస్తున్న కన్నీటిని ఆపుకునే ప్రయత్నంలో అతనికి మాట పెగల్లేదు.

రాధిక భర్త భుజాన్ని గట్టిగా పట్టుకుని వాల్చిన తలని తియ్యలేదు, మూసుకున్న కళ్ళని తెరవలేదు. ధారలుగా కారి చీర మడతల్లోకి ఇంకిపోతున్న కన్నీటిని తుడుకునే ప్రయత్నం కూడా చెయ్యలేదు. శిలాప్రతిమలా ఉండిపోయింది.

'రాధికకేమీ కాలేదు కదా?' కిరణ్ కి వచ్చిన మొదటి అనుమానం అది.

తను ఇంజెక్షన్ చేసే పిల్లవాడు గట్టిగా ఏడిస్తేనే తట్టుకోలేని డా.రాజేష్ కూడా తను ఉన్న చోటనించి కదలలేదు. తెల్లని ఆయన ముఖం బాధతో ఎర్రబడింది.

రాధికనీ, కిరణ్ నీ చూస్తూ ఉండిపోయిన స్నేహితుడిని పిలిచాడు సుజిత్.

" రాజా, ఆర్ యూ ఓకే?" అంటూ. ఆ మాటకి సర్దుకున్న రాజేష్

“ హా, యా. బానే, బానే ఉన్నానూ.” అంటూ " సిస్టర్" అంటూ పిలిచాడు.

ఉరుకున వచ్చింది సిస్టర్ లీనా.

" రాధిక, రాధికని చూడండి ఒకసారి" అన్నాడు.

కిరణ్  నుంచి రాధిక ని నెమ్మదిగా విడదీసి జాగ్రత్తగా నడిపించుకుని ఎక్సామినేషన్ రూములో ఉన్న బల్ల మీద పడుకోబెట్టింది.

ఆ తర్వాత ఆమె చెంపలమీద నెమ్మదిగా తడుతూ " రాధిక గారూ" అంటూ పిలిచింది. సమాధానం రాకపోవడంతో కంగారు పడి పల్స్, బీ.పీ చూసింది. రెండూ తక్కువే ఉన్నాయి అంటూ డాక్టర్ కి చెప్పి, ఐ.వీ పెట్టమంటారేమో అని కనుక్కుంది.

డాక్టర్ల సలహా మేరకు ఐ.వీ పెట్టి ఆమె ముఖమూ, చేతులూ చల్లని బట్టతో తుడిచి, దుప్పటి కప్పి లైట్ తగ్గించి తలుపు దగ్గరగా వేసి ముందు గదిలోకి వచ్చింది.

“సడన్ గా షాక్ తగిలినట్టు అయిందనుకుంటా డాక్టర్. కొద్దిసేపటికి కోలుకుంటారు. భయం లేదు,  నేను చూసుకుంటాను" అంది.

ఆవిడ వైపు కృతజ్ఞతతో చూశాడు డా. రాజేష్. ఆయనకి కుడి భుజం ఆవిడ. ఆయన చెప్పినవి చెప్పినట్టుగానూ, చెప్పదల్చుకున్నది క్షణం లోనూ గ్రహించి చెయ్యడంలోనూ ఆవిడ ఎప్పుడూ ముందే.

"థాంక్ యూ సిస్టర్" అన్నాడు సుజిత్ కూడా.

మళ్ళీ ఆ గదిలో అలముకున్న నిశ్శబ్దం.

" ఇప్పుడేం చేద్దాం సుజీ?" అన్నాడు డా. రాజేష్ స్నేహితుడిని ఉద్దేశించి.

" వాళ్ళని కాస్త సేద తీరనిద్దాం. ఇలాంటి విషయం విని తట్టుకోవడం, నెమ్మదిగా ఆకళింపు చేసుకోవడానికి కొంత టైం కావాలి కదా. రాధిక గారు కోలుకున్నాకా, రేపు లేదా ఎల్లుండి మనం అందరం కలిసి మనకున్న ఆప్షన్స్ ని చర్చిద్దాం. నేను మనకున్న చికిత్సా విధానాల గురించి, ఇతర వివరాలగురించి చెప్తాను. ఆ తర్వాత మిగతా విషయాలను కూడా పరిగణన లోకి తీసుకుని నిర్ణయాలు తీసుకుందాం. సరేనా?" అంటూ కిరణ్ దగ్గరగా వచ్చి రెండు భుజాల మీద చేతులు వేసి.

" ఐ. యాం సారీ కిరణ్. పాపకి రాకూడని పరిస్థితి. కానీ ఓటమి ఒప్పుకునేవాళ్ళం కాదు మనమెవరం.

మనందరం గుర్తుంచుకోవలసినది ఏమిటంటే, మనధైర్యమే తనకి బలం. పాప చిన్నది కనక, తనకేమి చెప్పాలి? ఎంత చెప్పాలి? ఎప్పుడు చెప్పాలి? దగ్గరనించి అన్ని విషయాలు మనమే ఆలోచించుకుని అలాగే నడుచుకోవాలి. నన్ను నమ్మండి, పాపకి త్వరలోనే నయమవడానికి అన్ని అవకాశాలు ఉన్నాయి. నయమౌతుందనే ఆశిద్దాం. లెట్ అజ్ స్టే పాజిటివ్. ప్రస్తుతానికి ఇంకేమీ ఆలోచించద్దు, ఇందాకా చెప్పినట్టు మరో రెండు రోజుల్లో అన్నీ మాట్లాడుకుందాం. జాగ్రత్త. వస్తాను! " అంటూ కదిలాడు.

" పంపించేసి వస్తాను" అంటూ డా. రాజేష్ స్నేహితుడి వెనకే వెళ్ళాడు.

డాక్టర్ రాజేష్ గదిలో కిరణ్, రోహిణి, శేఖర్ మాత్రమే మిగిలారు.

" అయ్యో దేవుడా, ఎంత అన్యాయం. మన స్వప్ని తల్లికి ఇంత కష్టమేమిటండీ? నిజంగా దేవుడనే వాడు ఉన్నాడా? నేనెప్పుడూ అనేదాన్ని, పిల్లకి దిష్టి అని. కిరణ్ అన్నయ్య ఎప్పుడూ వినడు నా మాట. దిష్టి లేదూ, దేవుడూ లేదు అంటాడు. మీకు తెలియదూ అన్నయ్య సంగతి. ఇప్పటికైనా వెంకటేశ్వరస్వామి గుళ్ళో పదివారాలు అర్చన చేయిస్తే తప్పకుండా కోలుకుంటుంది పిల్ల" కళ్ళ నీళ్ళ పర్యంతమౌతూ అంది రోహిణి.

"ష్!! ఊర్కో రోహిణీ! ఏమిటా మాటలు. సమయం చూసుకోవద్దూ" అన్నాడు శేఖర్.

" పరవాలేదు శేకూ. ఇలాగైనా ఆమె మనసులో బాధ చెప్పనీ, మరేం పరవాలేదు. ఆ మాటలవేనక స్వప్నిపైన తనకున్న ప్రేమ తప్ప మరేమీ లేదని మనకు తెలియదూ? చెప్పుకోలేనంత బాధతో రాధిక ఎలాగయిందో మనం చూస్తున్నాం కదా." బాధగా అన్నాడు కిరణ్.

" ఊర్కోరా, కన్నతల్లి మనసు ఎంత తల్లడిల్లుతుందో మనం ఊహించలేనిది కాదు కదా. రాధిక కేమీ కాదు, మరో అరగంటలో మామూలౌతుంది చూడు" అన్నాడు మిత్రుడి తో అనునయంగా.

పదండి, వెయిటింగ్ రూం లో కూర్చుందాం. ఇంతసేపు మనం డాక్టర్ గారి గదిలో ఉండడం కరక్ట్ కాదు" అంటూ ఇద్దరినీ తీసుకుని వెయిటింగ్ రూములోకి వచ్చాడు శేఖర్.

నోటిమీద వేలు పెట్టుకుని చిన్న పాప 'డాక్టర్ లోపలున్నారు, దయచేసి వేచి ఉండండి. అంటూ రాసున్న బోర్డ్ చూడగానే కిరణ్ పెదవులమీద చిన్న చిరునవ్వు చేరింది.

అతనికి గుర్తున్నప్పటినించీ రాజేష్ క్లినిక్ కి రాగానే స్వప్నిక చేసే పని అదే.

బాగా చిన్నపిల్లగా ఉన్నప్పుడు క్లినిక్ కి రాగానే కిల కిలా నవ్వుతూ, అంతలోనే నోటిమీద వేలుంచుకుని 'ష్' అంటూ ఆ బొమ్మలోని పాపని అనుకరించేది

ఆపైన చదవడం వచ్చినప్పటినించి పైకే పెద్దగా చదివేది. మొదట్లో ముద్దుమాటలతో మొదలైన అది రాను రాను స్పష్టంగా చదివేది.

ఆ తర్వాత  తానే తనకు వచ్చిన ఇతర భాషల్లోకి తర్జుమా చేతూ చెప్పడం, అంతలోనే ముఖమంతా పరుచుకునే వెన్నెల్లాంటి చిరునవ్వు నవ్వడం.

ఇదో చిన్న వేడుక ఆ పాపకి.

ఇన్నేళ్ళల్లోనూ వచ్చినన్ని సార్లూ అదే జరిగేది. ఒక్కసారి కూడా మారలేదు, మర్చిపోదు.

అది గుర్తొచ్చే చిరునవ్వొచ్చింది కిరణ్ కి.

అంతలోనే మేఘం లా దిగులు కమ్ముకుంది.

పక్కనే కూర్చున్న ప్రాణ మిత్రుడు శేఖర్ చెతిలో చెయ్యి వేసి, తల కిందకి వాల్చుకున్నాడు కిరణ్.

తన చేతిలో మిత్రుడి చెయ్యి పట్టు బిగించాడు శేఖర్.

“రాధి ఎలా ఉందో సిస్టర్ ని అడిగిరానా?” ఆత్రంగా అంది రోహిణి.

" వద్దు, తనని పడుకోనీ. ఏదైనా ఉంటే సిస్టర్ చెప్తారుగా. డాక్టర్ రాజేష్ ని రానీ, ఆయనతో మాట్లాడితే మనకి బావుంతుంది, డాక్టర్ సుజిత్ ఇంకేదైనా చెప్పారేమో కూడా తెలుస్తుంది" అన్నాడు శేఖర్.

డా సుజిత్ ని పంపించి రావలసిన రాజేష్ గురించి ఆత్రంగా చూస్తున్నారు ఆ ముగ్గురూ.

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments